క్లుప్తంగా

లక్ష్మీనృసింహస్వామికి తులసీ దళార్చన



భక్తులకు తులసీ దళాలతో దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని వేణుగోల స్వామి ఆలయ ప్రాంగణంలో వెలసిన లక్ష్మీన్ఋసింహస్వామికి తులసీదళాలు, గులాబీలతో గురువారం అర్చన చేశారు. స్వామివారిని అర్చన చేసిన అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ ప్రతిగురువారం స్వామివారికి పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో పలు ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు స్వామికి పూజలు చేస్తారని చెప్పారు. సంతానలేమి, గృహదోషాలు, కుటుంబ కలహాలతో ఇబ్బందులు పడుతున్న వారు, వివాహం కాని మహిళలు పెద్ద ఎత్తున స్వామి వారికి ముడుపులు చెల్లించి పూజలు నిర్వహించినట్లు తెలిపారు. స్వామివారిని దర్శించుకునేందుకు దూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులందరికీ తీర్థప్రసాదాల వితరణ చేశారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన అప్పలరాజు

బలిజిపేట: మండల తహసీల్దార్‌గా బి.పి. అప్పలరాజు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఇంతవరకు పార్వతీపురం ఆర్డీఓ కార్యాలయంలో ఏఓగా పనిచేశారు. ఇంతవరకు బలిజిపేట ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా రత్నకుమారి విధులు నిర్వహించిన సంగతి తెలిసిందే. కొత్తగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌కు కార్యాలయం సిబ్బంది అభినందనలు తెలిపారు.

సీతారాముల కల్యాణానికి ముహూర్తపు రాట



ముహూర్తపు రాట వేస్తున్న భక్తులు

సాలూరు: మండలంలోని కొత్తవలసలో సీతారాముల కల్యాణానికి గురువారం ముహూర్తపు రాట వేశారు. గ్రామంలో నూతనంగా రామాలయం నిర్మించిన క్రమంలో ఈ నెల 5న విగ్రహ ప్రతిష్ఠ, కల్యాణం, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు జయసింహ, తదితరులు తెలిపారు.

నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సత్యం

సీతంపేట: ఉపాధి హామీ పనుల్లో నిర్దేశించిన 14 లక్షల పని దినాల లక్ష్యాలను చేరుకోవాలని ఎంపీడీఓ కొండపల్లి సత్యం అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో హ్యాబిటేషన్‌ల పరిధిలో పనులు జరిగేలా చూడాలన్నారు. జాబ్‌కార్డులు ఉన్న ప్రతీ ఒక్కరికి పని కల్పించాలన్నారు. హార్టీకల్చర్ ప్లాంటేషన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

భామిని: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సమకూరుతుందని, మలేరియా వంటి వ్యాధులకు చెక్ పెట్టేందుకు పరిసరాల పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీఓ గుర్ల కృష్ణారావు అన్నారు. మండలంలోని నల్లరాయిగూడ గిరిజన గ్రామంలో దోమల నివారణకు ఏసీఎం 5 శాతం మందును గురువారం పిచికారీ చేయించారు. దీన్ని పరిశీలించిన ఎంపీడీఓ ప్రతీ ఇంట్లో విధిగా దోమల నివారణ మందు పిచికారీ చేయించాలన్నారు. సబ్ యూనిట్ అధికారి పి.అప్పారావు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో బాలేరు వైద్యాధికారి డాక్టర్ దీపికా రాణి, సర్పంచ్ బిడ్డిక గౌయింతి, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఠంచన్‌గా పింఛన్ల పంపిణీ



లచ్చయ్యపేటలో పింఛన్ పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ ఎం.బాబ్జీ



చినభోగిలిలో మంచాన పడి ఉన్న వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న సచివాలయ కన్వీనర్ శ్రీనివాసరావు

సీతానగరం: దివ్యాంగులు, వితంతువులు వృద్ధులు, కళాకారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్ల ద్వారా వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయడం అభినందనీయమని జెడ్పీటీసీ సభ్యుడు ఎం.బాబ్జీ అన్నారు. జూన్1వ తేదీ కావడంతో మండలంలోని అన్నిగ్రామాల్లో గురువారం ఉదయం 5 గంటలనుంచే వలంటీర్లు స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పింఛన్లు ఠంచన్‌గా పంపిణీ చేశారు. ఈ మేరకు లచ్చయ్యపేటలో సర్పంచ్ సీహెచ్ కృష్ణ, ఎంపీటీసీ సింహాచలం, అప్పలనాయుడు ఆధ్వర్యంలో జెడ్పీటీసీ బాబ్జీ దివ్యాంగుడికి పింఛన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం పారదర్శకంగా సేవలందించాలని సంకల్పించిందన్నారు. ఈ నేపథ్యంలో సంక్షేమ పథకాలను మండలంలో అమలు జరుగుతున్నాయన్నారు. అలాగే చినభోగిలిలో సచివాలయ కమిటీ కన్వీనరు కె.శ్రీనివాసరావు మంచం పట్టిన వృద్ధుని ఇంటికి వెళ్లి పింఛన్ అందజేశారు. అలాగే అప్పయ్యపేటలో బి. సూర్యనారా యణ వృద్ధులకు పింఛన్లు ఉదయాన్నే పంపిణీ చేశారు. అన్ని గ్రామాల్లో సోషల్ వెల్ఫేర్ సహాయకుల పర్యవేక్షణలో పింఛన్లు పంపిణీ చేస్తున్నారు.

ఇళ్ల పట్టాల అందజేత



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: పాచిపెంట మండల కేంద్రంలోని జగనన్న కాలనీకి చెందిన పలువురు మహిళలకు ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ఇళ్ల పట్టాలను గురువారం పంపిణీ చేశారు. పాచిపెంట మండల కేంద్రానికి చెందిన 12 మందికి రాజన్నదొర ఆయన స్వగృహంలో పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు డోల బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

లచ్చయ్యపేట కాలనీలో పారిశుద్ధ్యం



కాలనీలో సీసీరోడ్డుకు ఇరువైపులా తొలగిస్తున్న పిచ్చిమొక్కలు

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేటలో కాలనీకి పాముల బెడద ఎక్కువగా ఉండడంతో సర్పంచ్ సీహెచ్ కృష్ణ ఆధ్వర్యంలో గ్రీన్అంబాసిడర్లు, కూలీలు గురువారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణ మాట్లాడుతూ పాముల బెడద ఉందని కాలనీవాసులు తెలియ చేయడంతో గ్రీన్అంబాసిడర్లతో పాటు కూలీలు కాలువల్లో పూడికలు తీసి, మంచి నీటి పైప్‌లైన్ల చుట్టూ పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్నట్లు చెప్పారు. జగనన్న ప్రభుత్వం హయాంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు కృషి ఫలితంగా ప్రజల కోరిక మీదట గ్రామానికి అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలియజేశారు. అలాగే లచ్చయ్యపేట మధుర గ్రామం గుమ్మిడివరంలో మంచినీటి పథకం ద్వారా ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. జెడ్పీటీసీ బాబ్జీ, ఎంపీటీసీ అక్కపోలు సింహాచలం, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అప్పలనాయుడు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

పెదభోగిలిలో పారిశుద్ధ్య పనులు



చెత్తకుప్పలను తీయిస్తున్న గరికయ్య

సీతానగరం: మండలంలోని పెదభోగిలి మేజర్ పంచాయతీలో గల సుంకరివీధిలో సీతానగరం సర్పంచ్ జె.తేరేజమ్మ ఆధ్వర్యంలో కార్యదర్శి జె.వెంకటరావు గురువారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ భోగితల్లి అమ్మవారి జాతర సందర్భంగా వీధుల్లో, కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి ప్రభుత్వం సమకూర్చిన ట్రాక్టర్ సాయంతో దూర ప్రాంతానికి తరలిస్తున్నామన్నారు. పంచాయతీ పరిధిలో ఉన్న నాలుగు గ్రామాల్లో దశల వారీగా పారిశుద్ధ్య పనులు చేపట్టడానికి సిద్ధం చేశామని తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి జె. గరికయ్య పాల్గొన్నారు.

అమృత్ సరోవరం అభివృద్ధికి ప్రాధాన్యం



వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

• ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: ప్రభుత్వం అమలు చేసిన అమృత్ సరోవరం పథకం ద్వారా గ్రామానికో మంచినీటి కోనేరును అభివృద్ధి చేసి ఆహ్లాదకరమైన వాతావరణం కలిగించేలా చెరువుల రూపురేఖలు మారుస్తున్నామని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని అప్పయ్యపేట, కాశీపేట గ్రామాల్లో జరుగుతున్న అమృత్ సరోవరం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అప్పయ్యపేటలో మాట్లాడుతూ మండలంలో (2022–23 ఆర్థిక సంవత్సరం) తొలివిడతలో జానుమల్లువలస, అంటిపేట గ్రామాల్లో మంచినీరు కోనేర్ల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. రెండవ(2023–24 ఆర్థిక సంవత్సరంలో) ఫేజ్‌లో ఇంజినీరింగ్ అధికారుల పరిశీలన అనంతరం సూరంపేట, జోగింపేట, అప్పయ్యపేట, కాశీపేట, వెంకటాపురం, కోటసీతారాంపురం, కృష్ణారాయ పురం గ్రామాల్లో మంచి నీరు కోనేర్లను అమృత్ సరోవర్ చెరువులుగా ఆధునీకరించడానికి అవసరమైన పనులు చేపట్టినట్లు తెలిపారు. చెరువు గట్లపై సాయంత్రం సమయంలో విశాలమైన గాలి, చెట్ల నీడనిచ్చే విధంగా అభివృద్ధి పనులు చేపట్టడానికి ఇప్పటికే తయారు చేసిన ప్రణాళికల ఆధారంగా మట్టి పనులు చెరువు గట్టుపై జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సీతానగరం ఎంపీటీసీ బి.కుసుమ, కాశీపేట సర్పంచ్ టి. ధనుంజయమ్మ, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బి.సూర్యనారాయణ, టి శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ బి ధనుంజయ్, ఉపాధిహామీ పథకం సహాయ సంచాలకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

మంచి నీటి ట్యాంకు ఏర్పాటు



నీటి సరఫరా పథకాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ గౌరీశంకరరావు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం గ్రామంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కాలనీకి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు, వైశ్య సంఘం అధ్యక్షుడు గుడ్ల హరిప్రసాద్ తన కుమార్తె నైమిష జ్ఞాపకార్థం సుమారు రూ.2 లక్షల వ్యయంతో 24 గంటల పాటు 5 కుళాయిల ద్వారా కాలనీ వాసులకు మంచి నీటిని సరఫరా చేసేందుకు బోర్ తవ్వించి ట్యాంకును ఏర్పాటు చేయించారు. ఈ మేరకు గురువారం ఈ ట్యాంకు ద్వారా నీటి సరఫరా కార్యక్రమాన్ని సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్‌తో కలిసి పూజా కార్యక్రమాలు, హోమం నిర్వహించిన అనంతరం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుమార్తె జ్ఞాపకార్థంగా కాలనీలో నీటి సమస్య తీర్చేలా పథకం ఏర్పాటు చేసిన హరిప్రసాద్ దంపతులను అభినందించారు. కార్యక్రమంలో వైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు ఆనందరావు, వర్తక సంఘం అధ్యక్షుడు విష్ణుప్రసాద్, పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి జగన్నాథరథో తదితరులతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు ముందస్తుగా వరి విత్తనాలు



బాలేరు ఆర్‌బీకేకి చేరిన వరి విత్తనాలు

భామిని: మండలంలోని ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన వరి విత్తనాలు ముందస్తుగా వస్తున్నాయి. మండలంలోని బాలేరు రైతు భరోసా కేంద్రానికి 1061 బస్తాల ఆర్‌జీసీ వరి విత్తనాలు గురువారం వచ్చాయి. వ్యవసాయ సహాయకురాలు జ్యోతి, రైతు మిత్ర తిరుపతిరావుల పర్యవేక్షణలో ఆర్‌బీకేలో నిలవ చేయించారు. రైతు అవసరాల మేరకు ఆర్‌బీకేల ద్వారా నమోదు చేసిన మేరకు వరి విత్తనాలు వస్తున్నట్లు తెలిపారు.

నర్సిపురంలో ఫ్యామిలీ డాక్టర్ శిబిరం



నర్సిపురంలో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ తిరుమల ప్రసాద్

పార్వతీపురంటౌన్: ప్రతి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానంలో నెలకు రెండు సార్లు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని వైద్యాధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని నర్సిపురం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా గర్భిణులు, వృద్ధులు, చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి నెలలో రెండుసార్లు నిర్వహించే వైద్యశిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో నిర్వహించే వైద్యశిబిరంలో వైద్యపరీక్షలను నిర్వహిస్తూ అందుబాటులో ఉన్న62రకాల మందులు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో మంచానపడి ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి అక్కడే వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, సీహెచ్ఓలు, 104 సిబ్బంది, డేటాఎంట్రీ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

వేగవంతంగా భూ రీ సర్వే



సమగ్ర సర్వే కార్యక్రమంలో రికార్డులు పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది

పాలకొండ రూరల్: పట్టణ పరిధిలో సమగ్ర భూ సర్వే కార్యక్రమాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నట్టు ఇన్‌చార్జ్ తహసీల్దార్ బొమ్మలాట బుచ్చయ్య అన్నారు. పాలకొండ – వీరఘట్టం రహదారిలో సర్వే నంబర్ 170 నుంచి 200 మధ్య గల భూముల్లో రీసర్వే శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ సచివాలయాల వారీగా సర్వే చేపట్టనున్న భూముల యజమానులకు, రైతులకు ముందుగా సమాచారం అందిస్తున్నామన్నారు. సర్వేకు సహకరించే క్రమంలో సదరు సర్వే నంబర్ల మధ్య గల భూ హక్కుదారులు తమ డాక్యుమెంట్ల జిరాక్స్‌లు, ఆధార్, బ్యాంక్ అకౌంట్, పాస్‌బుక్ నకళ్లు, రెండు కలర్ పాస్ ఫొటోలు అందించాలన్నారు. మొబైల్ డీటీ పల్లా సన్యాసిరావు, మండల సర్వేయర్ పి.వెంకటరావు, సర్వేయర్లు నాగరాజు, గణేష్, వీఆర్‌ఓలు బలివాడ సాయి శ్రీనివాస్, పాలవలస రమేష్‌బాబు, సచివాలయ సిబ్బంది తదితరులున్నారు.

వినతులపై దర్యాప్తు



ఫిర్యాదుదారులను విచారిస్తున్న తహసీల్దార్, పీఎంయూ కమిటీ సభ్యులు

భామిని: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన వినతులకు సంతృప్తికర పరిష్కారం కోసం గురువారం పీఎంయూ కమిటీ దర్యాప్తు చేపట్టింది. తహసీల్దార్ నీలాపు అప్పారావు పర్యవేక్షణలో ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కమిటీ పరిశీలన చేసింది. ఫిర్యాదుదారులను విచారించింది. ఎంపీడీఓ గుర్ల కృష్ణారావు, డిప్యూటీ తహసీల్దార్ నిమ్మల శేఖరం, వైద్యాధికారి డాక్టర్ ఫణికుమార్ హాజరయ్యారు. ఘనసర, భామిని నుండి వచ్చిన వినతులపై దర్యాప్తు చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



చలివేంద్రిలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న ఫారెస్టు అధికారులు

వీరఘట్టం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పార్వతీపురం మన్యం జిల్లా సోషల్ ఫారెస్టు రేంజర్ శాస్త్రి అన్నారు. మండలంలోని చలివేంద్రి సచివాలయం వద్ద గ్రామస్తులకు పర్యావరణ పరిరక్షణపై గురువారం అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరు ఇంధన పొదుపు పాటించాలని, సోలార్ సిస్టమ్ వైపు అడుగులు వేయాలని సూచించారు. అడవులను పరిరక్షించి, వన్యప్రాణుల మనుగడకు ఇబ్బందులు లేకుండా ప్రజలు సహకరించాలని కోరారు. ఆయనతో పాటు వీరఘట్టం సెక్షన్ ఆఫీసర్ రవిబాబు ఉన్నారు.

పాఠశాలలు తెరిచిన రోజే విద్యాకానుక



జేవీకే స్టాక్ పాయింట్‌లో పుస్తకాలను పరిశీలిస్తున్న ఉప విద్యాశాఖాధికారిణి

వీరఘట్టం: ప్రస్తుత విద్యా సంవత్సరంలో పాఠశాలలు తెరిచిన రోజే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక అందజేస్తామని పాలకొండ ఉప విద్యాశాఖాధికారిణి ఆర్.విజయకుమారి వెల్లడించారు. స్థానిక బాలికోన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన జేవీకే స్టాక్ పాయింట్‌ను గురువారం ఆమె పరిశీలించారు. పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫామ్స్, బూట్లు ఇలా వచ్చిన అన్నింటిని వేర్వేరు గదుల్లో ఇక్కడ సిబ్బంది భద్రపరిచారు. తరగతుల వారీగా జగనన్న విద్యాకానుకలను సిద్ధం చేశారు. ఆమెతో ఎంఈఓ ఎం.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు శత్రుచర్ల పరామర్శ



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న శత్రుచర్ల పరీక్షిత్‌రాజు

కురుపాం/జియ్యమ్మవలస: జియ్యమ్మవలస మండలంలో ఇటీవల మృతి చెందిన పలువురి బాధిత కుటుంబాలను వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు గురువారం పరామర్శించారు. తొలిత శిఖబడి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కోట సత్యంనాయుడు ఇటీవల మరణించగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సంతాపాన్ని తెలిపారు. కారణాలు అడిగి తెలుసుకున్నారు. తరువాత చినమేరంగి గ్రామానికి చెందిన పాదిలాపు సావిత్రమ్మ, సూరు గోవిందరావు మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించారు. అన్ని విధాల అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు తదితరులు ఉన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



బోరు మరమ్మతులను పరిశీలిస్తున్న ఎంపీపీ

కురుపాం: వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి లేకుండా క్రాష్ కార్యక్రమంలో చర్యలు చేపడుతున్నట్టు ఎంపీపీ శెట్టి పద్మావతి, సర్పంచ్ గార్ల సుజాత అన్నారు. స్థానిక శోభలతాదేవి కాలనీలో తాగునీటి బోరు మరమ్మతుల ప్రక్రియను వారు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తీవ్రమైన వేసవి దృష్ట్యా తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. వారి వెంట ఉప సర్పంచ్ ఆదిల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేణు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కార్తీక్, మెకానిక్ సిబ్బంది ఉన్నారు.